నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 26 నవంబర్ 2024 RANGAREDDY



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

## సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయండి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, నవంబర్ 25 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరికొంతమంది ఆపరేటర్లను నియమించుకుని త్వరగా పని పూర్తి చేయాలని సూచించారు. అదనంగా కంప్యూటర్లు కావాలంటే కలెక్టరేట్ నుంచి తెచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. డాటా ఎంట్రీ ప్రక్రియ ఒకే గదిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సూచించారు. ముందుగా వికారాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి డార్మెంటరీ, వంట గది, భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు.

## 1930నీ వదలట్లే!

**మరొకరికి నంబర్ కలిపి.. సైబర్ పోలీసులమంటూ.. వివరాల సేకరణ**

**కొత్త రూట్‌లో బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఆగంతకులు**

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): సీబీఐ, ఈడీ పేర్లతో పాటు సైబర్ నేరగాళ్లు బాధితులను భయపెట్టించడంలో 1930 నంబర్‌ను కూడా వాడుతూ అమాయకులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని కేంద్రం సైబర్ బాధితుల కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. సైబర్‌నేరాలపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. అయితే సైబర్‌నేరగాళ్లు ఈ నంబర్‌ను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా డిజిటల్ అరెస్ట్‌లలో ఈ నంబర్‌ను నేరగాళ్లు వాడుతున్నారు. మోసమని అనుమానం వచ్చి సైబర్ పోలీసులకు చెబుతామంటూ.. బాధితులు చెబితే, ఆగండి 1930 నంబర్‌కు నేనే కలుపుతున్నానంటూ ఫోన్ నంబర్‌ను మరొకరికి కలిపి 'సైబర్ పోలీసులం' చెప్పండి అంటూ వివరాలు సైతం తీసుకుంటున్నారు.

**ఎవరికీ చెప్పకోవాలనే ఆలోచన..**

'ఫెడెక్స్ కొరియర్, ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నాం..మీ ఫోన్ రెండు గంటల్లో బ్లాక్ అవుతుంది.. మేం సీబీఐ, ఈడీ నుంచి మాట్లాడుతున్నామం'టూ సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేస్తారు. ఇలా ఫోన్ చేయగానే మీ ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో భారీగా లావాదేవీలు జరిగాయి.. మనీలాండరింగ్ కేసుతో ఈ నంబర్లకు సంబంధాలున్నాయి.. కేసు నమోదయ్యిందంటూ మాట్లాడుతారు. దీనికి సంబంధించిన విచారణ చేయాలి..మేం పోలీసులమంటూ పోలీసు దుస్తులతో వచ్చి బాధితులను డిజిటల్ అరెస్ట్ చేస్తారు. బాధితులతో కొంత సేపు ఆప్యాయతగా, మరి కొంత సేపు భయపెడుతూ మాట్లాడుతారు. ఇలా సహాయం చేసేందుకు మేమే ఉన్నామని బాధితుల్లో ఒక నమ్మకాన్ని కుదిర్చి ఆ తరువాత బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తారు. ఇందులో ఎవరికైనా అనుమానం వచ్చి మేం సైబర్‌క్రైమ్ పోలీసులకు చెబుతాం, 1930కి ఫోన్ చేస్తామంటూ ఎవరైనా సైబర్ నేరగాళ్లతో మాట్లాడితే మీరు చెప్పడం ఎందుకు.. ఇప్పుడే సైబర్‌క్రైమ్ వాళ్లను లైన్లోకి తీసుకుందామంటూ వాళ్లే సైబర్ పోలీసులమంటూ మాట్లాడుతారు. ఇలా కొత్త రూట్లో సైబర్ నేరగాళ్లు బాధితులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.




**బాధితులూ జాగ్రత్త..**

**టోల్‌ఫ్రీ నంబర్‌నూ వాడేస్తున్న సైబర్ చీటర్స్**

**బాధితులకు అనుమానమొస్తే.. 1930కి మేమే కలుపుతామంటున్న ఆగంతకులు**

సైబర్‌నేరాల్లో మోసపోయిన వారి గురించి.. మోసగాళ్లకు తెలిసి ఉంటుంది. మోసపోయిన తరువాత 1930కి బాధితులు ఫోన్ చేస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన తరువాత కొన్ని రోజులకు బాధితులకు తిరిగి ఫోన్ చేసే అవకాశాలుంటాయి. మేం 1930 నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పి, ఏదో సహాయం చేస్తామంటూ నమ్మించి మోసం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. గతంలో ఫిర్యాదు చేసి ఉండడంతో బాధితులు నిజమనే నమ్మకం కూడా ఉంటుంది. ఎవరు ఫోన్ చేసినా ఆర్థిక పరమైన అంశాలు, డబ్బు డిపాజిట్ చేయమన్నారంటే అది మోసమని గుర్తించాలని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

## నేడు బీఆర్ఎస్ జిల్లా సన్నాహక కమిటీ సమావేశం

**పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



మంచాల, నవంబర్ 25 : బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సన్నాహక కమిటీ సమావేశం నేడు శంషాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఆరుట్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించనున్న దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే జిల్లా సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# బాధితులకు అండగా ఉంటాం..



గిరిజన మహిళతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

*'భూ సేకరణ ప్రక్రియలో హడావుడి ఎందుకు.. భూ సేకరణ చట్టం 2013కు లోబడి నిబంధనల ప్రకారం జరుగాలి..' అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం దుద్యాల మండలంలోని లగచర్ల, రోటిబండ తండా గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ బృందం సభ్యులు పర్యటించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన జరిగిన ఘటన వివరాలను తెలుసుకోవడంతోపాటు ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేస్తున్నట్లు ముందుగా అధికారులు తెలుపలేదని, బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వకపోవడంతో ఆరా తీస్తే విషయం తెలిసిందని బాధితులు కమిషన్ సభ్యులకు మొర పెట్టుకున్నారు. దీంతో ఆందోళనకు గురయ్యామని, అనుకోకుండా లగచర్లలో ఘటన జరిగిందని, అంతమందిలో కలెక్టర్ ఉన్నట్లు తమకు తెలియదని వారు వివరించారు. ఉన్న ఎకరం, రెండు ఎకరాల పొలం పోతే ఏం చేసి బతకాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుల ఎదుట తమ గోడును వెల్లడించారు. రాత్రికిరాత్రే పోలీసులు వచ్చి సంబంధం లేని వారిని కూడా అరెస్టు చేసి తీసుకెళ్లారని, తర్వాత కొంత మందిని విడిచిపెట్టారని కన్నీటిపర్యంతమయ్యారు. ఇంకా మరి కొంత మంది అమాయకులు జైలులోనే ఉన్నారని బోరుమన్నారు. మాకు న్యాయం చేయాలని, తమ వారిని విడిపించి పుణ్యం కట్టుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులను ఫార్మా బాధితులు వేడుకున్నారు.*

*- కొడంగల్, నవంబర్ 25*

## భూ సేకరణలో హడావుడి ఎందుకు ?

**భూ సేకరణ చట్టం ప్రకారమే జరుగాలి**

**అధికారులపై దాడిని ఖండిస్తున్నాం..**

**అవగాహన లేకనే రైతుల్లో ఆందోళన**

**అరెస్టు చేసిన అమాయకులను విడుదల చేయాలి**

**దాడికి పాల్పడిన వారిపైనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి**

**ఇక్కడ జరిగిన పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం**

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

### రైతుల ఇష్ట ప్రకారమే భూ సేకరణ జరుగాలి..

**- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

రైతుల ఇష్ట ప్రకారమే భూ సేకరణ జరుగాలి.. సామరస్యంగా మాట్లాడుకుంటే ఉత్తమంగా ఉండేది.. లగచర్ల ఘటన బాధాకరం.. కలెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం.. అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం లగచర్ల భూ బాధితులతో ఆయన మాట్లాడారు. బలవంతంగా భూ సేకరణ జరిగే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం... భూమికి భూమి లేదా నగదు వంటి ఇతరత్రా సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. హడావుడిగా వచ్చి భూములను తీసుకోవడం కుదరదని పేర్కొన్నారు. ఇంత వరకు అధికారులు భూమిని సేకరిస్తున్నట్లు ఏమైనా నోటీసులు అందించారా... అంటూ బాధితులను అడుగగా.. ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, అందుకే ఆందోళనకు గురయ్యామని గ్రామస్తులు తెలిపారు. ముందస్తు నోటీసులు ఇవ్వడంతోపాటు గ్రామంలో దండోరా వేయించి భూ సేకరణ చేపడుతున్నట్లు చెప్పాల్సి ఉంటుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణతో పాటు రైతులు ఆందోళనకు గురికాకుండా కౌన్సెలింగ్ తదితర ప్రక్రియలనూ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. తాతల కాలం నుంచి గిరిజన రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, భూములు కోల్పోతున్నట్లు తెలిస్తే బతుకులు భారంగా మారి ఆవేదన చెందడం సహజమేనన్నారు. బాధిత కుటుంబాల నుంచి పూర్తి వివరాలు సేకరించామని, రైతులకు అండగా ఉంటామని, అవసరమైతే సీఎంను కలిసి నివేదిక అందిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రైతులకు భరోసా ఇచ్చారు. ఘటనకు సంబంధం ఉన్న వారిపైనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అరెస్ట్ అయిన అమాయకులను వెంటనే విడుదల చేసి, వారిపై పెట్టిన కేసును రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీళాదేవి, రాంబాబునాయక్, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, అధికారులు పాల్గొన్నారు.



# పత్తి రైతు అప్పులపాలు



**ఆరుగాలం కష్టపడి తెల్లబంగారాన్ని పండించిన రైతు తెల్లబోయిండు.. అప్పుసప్పు చేసి భూమిని చదును చేసి విత్తనాలు, ఎరువులను తెచ్చి సాగు చేస్తే.. ఆరంభంలోనే వరుణుడు షాక్ ఇచ్చిండు.. అంతంత మాత్రంగానే కురిసిన వానలకు చేను ఎదుగకపోవడంతో పత్తి మందులకని మళ్లీ అప్పులు చేసిండు.. పంట చేతికొచ్చాక.. కూలీల కొరత రైతన్నను కలిచివేసింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు కిలో పత్తికి రూ.13 చెల్లించి, వారితోపాటు ఇంటిల్లిపాది కష్టపడి పత్తిని తెంచుకున్నరు. పంట చేతికొచ్చిందని సంబురపడ్డ రైతు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి రోజుల తరబడి నిరీక్షించ లేక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటు ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వక.. అటు దళారులు అగ్గువకే పత్తిని కొనడంతో పత్తి రైతు నిండా మునిగిండు..**

**- రంగారెడ్డి, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)**



**దిగుబడి తక్కువే.. మద్దతు ధరా తక్కువే..**

**కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు**

**అరకొరగా కొనుగోలు కేంద్రాలు**

**రోజుల తరబడి కేంద్రాల్లో నిరీక్షణ**

**దళారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్న రైతన్న**

**పట్టించుకోని ప్రభుత్వం..**

### జిల్లాలో లక్షా 39 వేల ఎకరాల్లో పత్తి సాగు..

రంగారెడ్డి జిల్లాలో ఈ వానకాలం లక్షా 39 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్, మహేశ్వరం డివిజన్ పరిధిలోని మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల, యాచారం మండలాలు, షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని కొందుర్గు, షాద్‌నగర్, ఫరుఖ్‌నగర్ మండలాల్లో పత్తి అధికంగా సాగైంది. ఈసారి జిల్లా లక్షా 50వేల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం సీసీఐ ద్వారా 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. సరైన మద్దతు ఇవ్వకపోవడంతోపాటు పత్తి నల్లబడిందని, తేమ శాతం ఎక్కువగా ఉన్నదని కొర్రీలు పెట్టడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

### రోజుల తరబడి నిరీక్షణ..

సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. దళారులు తీసుకెళ్లే పత్తి వాహనాలు మాత్రం నేరుగా కొనుగోలు కేంద్రాల్లోకి వెళ్తున్నాయన్న ఆరోపణలున్నాయి. తేమ శాతం అధికంగా ఉన్నదని కొర్రీలు పెడుతూ క్వింటాలు పత్తికి రూ. 6900 నుంచి రూ. 7000 చెల్లిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయలేక దళారులకే ఎంతోకొంతకు పత్తిని విక్రయించి నష్టపోతున్నారు. అయితే దళారులు తీసుకెళ్లిన పత్తికి మాత్రం కొనుగోలు కేంద్రాల్లో రూ.7300 చెల్లిస్తుండడం విశేషం. దళారులకు పెద్దపీట వేయడం సరైన పద్ధతి కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ తతంగం జరుగుతున్నదని జిల్లా రైతులు ఆరోపిస్తున్నారు.

### అప్పే మిగిలింది..



18 ఎకరాల్లో పత్తి సాగు చేసినా. పెట్టుబడికి రూ.ఆరు లక్షలు, కూలీలకు మరో రూ.మూడు లక్షలు ఖర్చు అయ్యింది. కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకెళ్లి రోజుల తరబడి పడిగాపులు కాయలేక మధ్య దళారికే క్వింటాల్ రూ.6800లకే పత్తి అమ్మినా. దీంతో అప్పులు మీద పడ్డాయి. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

**- తిరుమల్‌రెడ్డి, నల్ల చెరువు, మాడ్గుల మండలం**

### పత్తి ధర పెంచాలి..



పత్తికి సరైన మద్దతు ధర ఇవ్వాలి. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం మద్దతు ధరను క్వింటాలుకు రూ.10వేలు ప్రకటించాలి. మాడ్గుల మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో క్వింటాలుకు రూ.9 వేలు ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని రైతులను ఆదుకోవాలి.

**- కట్ట రాజు, నల్ల చెరువు**

## ఆటో డ్రైవర్లు చస్తుంటే.. విజయోత్సవమా?

**తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ**

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్లు చస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవం జరుపుకొంటున్నదని తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఆటో డ్రైవర్లతో డిసెంబర్‌లో చర్చలు జరపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రవిశంకర్, సమ్మయ్య యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రం పెంచిన రవాణా వాహనాల ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. నగరంలోకి గూడ్స్ వాహనాల అనుమతి సమయం పెంచాలని, వన్ నేషన్, వన్ ట్యాక్స్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారులపై ప్రభుత్వ చెక్‌పోస్ట్‌లు ఎత్తివేయాలని కోరారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతీస్తున్న రెడ్ అంబులెన్స్, గూడ్స్ వాహనాల ఉపాధి దెబ్బతీస్తున్న పోర్టర్ కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిషేధించాలన్నారు. ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల రూపంలో డ్రైవర్లను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం.. ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నందకిశోర్, మంద రవి కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

